క్లుప్తంగా

మంత్రిని కలిసిన పీఆర్టీయూ టీఎస్ నాయకులు



మంత్రి సబితా ఇంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ : జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ– తెలంగాణ సంఘం నాయకులు బుధవారం హైదరాబాద్‌లో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, విద్యా శాఖ డైరెక్టర్ దేవసేన, మోడల్‌స్కూల్ జేడీ సరోజినిదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి నూతనంగా ఎన్నికైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్‌కు అభినందనలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్ రెడ్డి, సంఘం అధ్యక్షుడు ఎం.చెన్నయ్య, అంజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్ష



దీక్షలో కూర్చున్న మాల మహానాడు సభ్యులు

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ పనులు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామంలో అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్ష బుధవారం 13వ రోజు కొనసాగింది. దీక్షలో ఆ గ్రామానికి చెందిన మాలమహానాడు నాయకులు కూర్చోగా అఖిలపక్ష పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులు, అధ్యక్షుడు నందిపాటి వెంకన్న, మహేశ్వరం భరత్ రాజ్, శంకరయ్య, యాదయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బజరంగ్‌దళ్ సభ్యులు

నల్లగొండ టౌన్ : బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని కర్ణాటక ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించడాన్ని నిరసిస్తూ బుధవారం స్థానిక గడియారం సెంటర్‌లో బజరంగ్‌దళ్ నాయకులు కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. బజరంగ్‌దళ్‌ను ఉగ్రవాద సంస్థలతో పోల్చడం సరికాదన్నారు. కార్యక్రమంలో కన్నెబోయిన వెంకట్, కృష్ణయ్య, సంపత్‌వర్మ, శేఖర్, గోవర్ధన్, శ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

నల్లగొండ టౌన్ : ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, అప్పటి వరకు వారికి రూ.26వేల కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో సుమారు 18వేల మంది వీఓఏలు గ్రామ సంఘాలకు సహాయకులుగా పనిచేస్తున్నారన్నారు. వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, బి.గణేష్, శరత్, సైదాబీ, దుర్గయ్య, లక్ష్మి, పాప య్య, సులోచన, అహల్య, నగేష్ పాల్గొన్నారు.

బిల్లులు నిలిపివేయాలి



సీసీరోడ్డును పరిశీలిస్తున్న జిట్ట నగేష్

చిట్యాల : మున్సిపాలిటీలోని శివనేనిగూడెం (ఒకటో వార్డులో), వెంకటాపురం (ఆరో వార్డు)లో యూఎఫ్ఐడీసీ నిధులతో నిర్మించిన సీసీరోడ్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలను పాటించని కాంట్రాక్టర్ బిల్లులను నిలిపివేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపాలిటీలోని శివనేనిగూడెంలో ఇటీవల నిర్మించిన ఇటీవల నిర్మించిన సీసీరోడ్లను జిల్లా అధికారులు పర్యవేక్షణ చేసి ఎంబీ రికార్డులను నిలిపి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడాలని కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు నారబోయిన శ్రీనువాసులు, బొబ్బలి సుధాకర్ రెడ్డి, చొప్పరి లింగయ్య, పాలమాకుల అర్జున్, పోతులూరి వెంకటాచారి, నర్సింహ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

లారీల కొరత తీర్చాలి

నల్లగొండ రూరల్ : కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని తరలించేందుకు లారీల కొరత లేకుండా చూడాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున కోరారు. బుధవారం మండలంలోని కంచనపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సత్యనారాయణ, పద్మారెడ్డి, నవీన్, పార్టీ నాయకులు, రైతులు ఉన్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు

- కంకరతేలి ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

కట్టంగూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లేదారి నుంచి నల్లగొండకు వెళ్లే రోడ్డు పొడవునా కంకరతేలి గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. దీంతో ఆ రోడ్డుపై వాహనదారులు ప్రయాణాలు సాగించాలంటే నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం పలు పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి ఈ దారిగుండా రాకపోకలు కొనసాగిస్తుంటారు. ద్విచక్రవాహనదారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతులు, పశువుల, గొర్ల కాపరులు ఈ దారిగుండా వెళ్లటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. బాట పొడవునా కంపచెట్లు పెరగడంతో పాటు గుంతలు ఏర్పడి కంకరతేలి ప్రమాదకరంగా ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారు. అంబటివాగు, రాంనగర్, అంబేద్కర్‌నగర్ కాలనీ ప్రజలు నిత్యం మండల కేంద్రానికి ఈ దారిలో వెళ్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. గత సంవత్సరం కురిసిన వర్షాలకు హైస్కూల్ సమీపంలో, కట్టంగూర్ గ్రామ పంచాయతీ సమీపంలో ఉన్న పెద్దవాగుపై నిర్మించిన కల్వర్టుల వద్ద మట్టికోతకు గురై పెద్దపెద్ద లోయలు ఏర్పడి ఇరువైపులా రాకపోకలు నిలిచిపోవడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



కట్టంగూర్ హైస్కూల్ నుంచి నల్లగొండ రోడ్డు వరకు తేలిన కంకర

ప్రతి సంవత్సరం వరద తాకిడితో ఇదే పరిస్థితి నెలకొంటున్నా అధికారులు మాత్రం శాశ్వత పరిష్కారం చూపడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతకు గురైన ప్రదేశంలో అధికారులు తాత్కాలికంగా మట్టిపోసి వదిలివేయడం ఆనవాయితీగా మారింది. తాత్కాలికంగా చేపట్టిన మరమ్మతులతో మరల కల్వర్టులు వరద తాకిడితో కోతకు గురై మట్టి కొట్టుకుపోవడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. జీపీ సమీపంలో చిన్నపాటి కల్వర్టు నిర్మించడంతో వరద తాకిడి అధికంగా ఉన్నప్పుడు మండల కేంద్రానికి వచ్చే అంబేద్కర్‌నగర్ కాలనీ ప్రజల రాకపోకలు నిలిచిపోయి ఇబ్బందులు పడాల్సివస్తుంది. ప్రతి సంవత్సరం కల్వర్టు సమీపంలో పోసిన మట్టి కొట్టుకుపోయి రాకపోకలకు తిప్పలు తప్పటం లేదు. హైస్కూల్, జీపీ సమీపంలో ఉన్న కల్వర్టు స్థానంలో నూతన బ్రిడ్జిలు నిర్మించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కట్టంగూర్ హైస్కూల్ సమీపంలో పెద్దవాగు కల్వర్టుపై మట్టిపోసి వదిలేసిన అధికారులు

పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మించాలి



కంకరతేలి రోడ్డు గుంతలమయంగా మారడంతో మా గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. పెద్దవాగుపై తాత్కాలికంగా మట్టిపోయడంతో మళ్లీ వర్షాలకు మట్టికొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంతో పాటు వర్షాకాలం రాకముందే పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మించి సమస్య పరిష్కరించాలి.

– మల్లెబోయిన గోవర్ధన్, అంబటివాగు

ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలి

- మిల్లర్లను ఆదేశించిన ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



మిల్లర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ : కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని మిల్లర్లు వెంటనే దిగుమతి చేసుకోవాలని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం పట్టణ సమీపంలోని రామలక్ష్మణ్ పార్ బాయిల్డ్, ఇతర మిల్లులను డీఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వర్‌రావులతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం ధాన్యం దిగుమతులపై మిల్లర్లతో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు తక్కువ దిగుమతి చేసుకున్న మిల్లర్లు అందరూ ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న గోదాములను గుర్తించి ధాన్యాన్ని నిల్వచేయాలన్నారు. వర్ష సూచనలు ఉండడంతో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ చీర పంకజ్‌యాదవ్, తదితరులు ఉన్నారు.

అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవు



ధాన్యం కొనుగొలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న దేవరకొండ ఆర్డీఓ గోపిరామ్

నాంపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని దేవరకొండ ఆర్డీఓ గోపిరామ్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీలు, లారీల డ్రైవర్లు అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై బుధవారం ఆయన కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సిబ్బంది మ్యాచర్ వచ్చిన రైతుల ధాన్యాన్ని క్రమపద్ధతిలో హమాలీలతో కాంటా చేయించాలని సూచించారు. ధాన్యం కాంటా, అదనపు వసూళ్లలో సిబ్బంది పాత్ర ఉన్నట్లు తెలిస్తే తప్పకుండా చర్యలు ఉంటాయన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, ఆర్ఐ దయాకర్‌రెడ్డి, సీఈఓ పూల శ్రీరాములు, శేఖర్‌రెడ్డి, వెంకటయ్య, పర్వతాలు, స్వామి, అంజి, యాదయ్య, అంజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

మినీ ట్యాంక్‌బండ్ పనులు పూర్తిచేయాలి

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



మినీ ట్యాంక్‌బండ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : పట్టణంలో జరుగుతున్న మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీలో ఆయన మార్నింగ్ వాక్‌లో భాగంగా కాలంవారికుంటలో రూ.4.92కోట్లతో జరుగుతున్న మినీ ట్యాంక్‌బండ్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అదే విధంగా వివిధ కాలనీల్లో పర్యటించారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, 1, 2వవార్డుల కౌన్సిలర్లు కందాల భిక్షంరెడ్డి, రాచకొండ సునీల్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మోహన్‌రెడ్డి

మర్రిగూడ : మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సర్వసభ్య సమావేశంలో గ్రామాల్లో గుర్తించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఉపాధిలో సీసీని ఏర్పాటు చేయాలని, ఇంకుడు గుంతల బిల్లులు రాకపోవడం, విద్యుత్ సమస్యలు పరిష్కరించి, రాజాపేటతండాలో శ్మశానవాటిక ఏర్పాటుకు చొరవ చూపాలని ఆయా శాఖల అధికారులకు ఆయన సూచించారు. అంతకు ముందు వైద్యులు తరుణ్ ఆధ్వర్యంలో సీపీఆర్ చేసే పద్ధతిపై అధికారులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్‌రావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ జూటూరు తారకరామన్, ఎంఈఓ గురువారావు, ఏఓ ఆవుల స్పందన, ఎంపీఓ ఝాన్సీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ యశ్వంత్, ఐబీ ఏఈ రాఘవేందర్, సూపరింటెండెంట్ యాకుబ్‌అలీ, వెటర్నరీ వైద్యులు స్వామి, ఏపీఎం హరి, ఏపీఓ వెంకటేశం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశోధ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టుపై ప్రభుత్వం వివక్ష వీడాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యం

మునుగోడు : బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం వివక్ష వీడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. కృష్ణాజలాల్లో తెలంగాణ వాటా తేల్చాలని, నల్లగొండ జిల్లాను సమగ్రంగా అభివృద్ధి పర్చాలని, చర్లగూడెం రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ పార్టీ చేపట్టిన పాదయాత్ర బుధవారం మండలంలోని సింగారం, రత్తుపల్లి, పులిపల్పుల, కల్వలపల్లి, గూడాపూర్, కొరటికల్ గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటికే 90శాతం పనులు పూర్తైన బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టుకు మరో రూ.100కోట్లు కేటాయిస్తే లక్ష ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధుల కేటాయింపులో వివక్ష చూపుతుందని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాత్రలో సీపీఐ నాయకులు ఆర్.అంజయ్యచారి, కె.శ్రీనివాస్, బి.గాలయ్య, నర్సింహ, రామచంద్రం, వెంకటేశ్వర్లు, శ్రీను, రమేష్, లక్ష్మారెడ్డి, వెంకన్న, నర్సింహ, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ఆకారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సమరంరెడ్డి, నాయకులు

శాలిగౌరారం : మండలంలోని ఆకారం గ్రామంలో బుధవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం స్థానిక సర్పంచ్ కందాల సమరంరెడ్డి ప్రారంభించారు. గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం నెలరోజులైనా నేటికి ప్రారంభం కాకపోవడంతో 'సాక్షి'దినపత్రికలో బుధవారం 'ప్రారంభానికి నోచుకోని కొనుగోలు కేంద్రం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి సంబంధిత జిల్లా ఉన్నతాధికారులతో పాటు ముఖ్య ప్రజాప్రతినిధులు స్పందించారు. ఈ నేపథ్యంలో రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని సంబంధిత అధికారులు ఐకేపీ ఏపీఎంను ఆదేశించారు. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో బుధవారం కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న, నాయకులు వలిశెట్టి దశరథ, సైదులు, భద్రయ్య, వెంకటయ్య, వెంకన్న, ఐకేపీ ఏపీఎం జానకి, సీసీ బాలు, ఇన్‌చార్జ్ ఏఈఓ రంజిత్, సంఘబంధం ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఐకేపీ ఏపీఎంతో రైతుల వాగ్వాదం..

సాక్షి ఎఫెక్ట్..

ఆకారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటులో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ఐకేపీ ఏపీఎం జానకితో రైతులు వాగ్వాదానికి దిగారు. గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభానికి వచ్చిన ఏపీఎం కేంద్రం ప్రారంభం అనంతరం రైతులనుద్దేశించి మాట్లాడుతుండగా రైతులు ఆమె మాట్లాడటాన్ని అడ్డుకున్నారు. కేంద్రానికి ధాన్యం తరలించి సుమారు నెలరోజులు కావస్తుందని, కొనుగోలు చేయాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోకుండా వ్యవహరించడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసి తీవ్రంగా నష్టపోయామని రైతులు ఏపీఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఘనంగా ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం

నల్లగొండ టౌన్ : పట్టణంలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ 77వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు సంఘం జెండావిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి సోమన్న మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఐఎన్‌టీయూసీ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో నల్లగొండ వైస్‌ఎంపీపీ జిల్లేపల్లి పరమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆదిమల్ల శంకర్, యువజన అధ్యక్షుడు నూకపంగ నాగయ్య, శంబిరెడ్డి, వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

చండూరు : ప్రతిఒక్కరూ బాలల హక్కులను పరిరక్షించాలని పుల్లెంల సర్పంచ్ సంధ్యారాణి అన్నారు. బుధవారం మండలంలోని పుల్లెంల గ్రామంలో బాలల హక్కుల పరిరక్షణపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 14ఏళ్లలోపు చిన్నారులను పనుల్లో భాగస్వామ్యం చేయకూడదని సూచించారు. సమావేశంలో ఐసీపీఎస్ అధికారి రాం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు ఉన్నారు.

జేపీఎస్‌ల సమ్మెకు పలువురి సంఘీభావం

మర్రిగూడ : తమను రెగ్యులరైజేషన్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మండల కేంద్రంలో చేపట్టిన శాంతియుత నిరవధిక సమ్మె బుధవారం 6వ రోజుకు చేరుకుంది. పలు గ్రామాల సర్పంచ్‌లు సమ్మెకు సంఘీభావం తెలిపారు. అనంతరం స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పాక నగేష్‌యాదవ్, కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఐతపాక జంగయ్య, మార్నేని నిర్మల, మాడం శాంతమ్మ, వెంకటమ్మ, కవితయాదయ్య, లక్ష్మీప్రసన్నరవి, మాధవిరమేష్, సబితయాదగిరిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కనగల్ : సమస్యలు పరిష్కరించాలని బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులు వంటా వార్పు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పాలడుగు నాగర్జున, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, ఏకలవ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మానుపాటి భిక్షం మద్దతు పలికారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చండూరు : తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మెకు బుధవారం పీఏసీఎస్ డైరెక్టర్ కట్ట భిక్షం మద్దతు తెలిపారు.

చిట్యాల : తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చిట్యాల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం ఆరోరోజుకు చేరింది. సమ్మెలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు స్థానిక అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు మల్లేష్, నర్సింహ, మాధవరెడ్డి పాల్గొన్నారు.



కనగల్ : ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వంటావార్పు చేస్తున్న కార్యదర్శులు

కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

నకిరేకల్ : తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 6వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు టీపీసీసీ నేత దైద రవీందర్ మద్దతు తెలిపి మాట్లాడారు. మద్దతు తెలిపిన వారిలో 4వవార్డు కౌన్సిలర్ గాజుల సుకన్యశ్రీనివాస్, నాయకులు ముద్దం విజయ్, యూసఫ్, రాజశేఖర్‌గౌడ్, సతీష్, సైదులు, పశుపతి, మహేష్, సతీష్, పంచాయతీ కార్యదర్శులు సురేష్, కిరణ్, ప్రవీణ్, అరుణ్, భరత్, రమేష్ ఉన్నారు.

కేతేపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె బుధవారం ఆరో రోజుకు చేరుకుంది. సమ్మెకు పలు గ్రామాల సర్పంచ్‌లు సంఘీభావం తెలిపి సమ్మెలో కూర్చున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కోట వెంకటేశ్వరావు, కట్ట శ్రవణ్, గోలి మంజుల వేణుమాధవరెడ్డి, చల్ల పూలమ్మకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పరమేష్, కృష్ణయ్య, నాగార్జున, హరీష్, సంతోష్, ప్రవీణ్, సైదులు, రాంప్రసాద్, రాధిక ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల మద్దతు

శాలిగౌరారం : తమ సమస్యలను పరిష్కరించడంతో పాటు ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె బుధవారం 6వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్ ఆధ్వర్యంలో నాయకులు సమ్మెలో పాల్గొని కార్యదర్శులకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆకారం సర్పంచ్ కందాల సమరంరెడ్డి సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు మధ్యాహ్న భోజనాన్ని అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇటుకులపహాడ్ సర్పంచ్ అల్లి సైదులు, మాధారంకలాన్ ఎంపీటీసీ నోముల జనార్దన్, నాయకులు భూపతి అంజయ్య, గూని వెంకటయ్య, అంజయ్య, పరమేశ్, నరేశ్, సైదులు, సత్తయ్య, మహేశ్, కార్యదర్శులు పాల్గొన్నారు.



నకిరేకల్ కార్యదర్శులకు సంఘీభావం తెలుపుతున్న దైద రవీందర్ తదితరులు



మర్రిగూడ : కార్యదర్శులకు సంఘీభావం తెలుపుతున్న సర్పంచ్‌లు

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న కల్లు గీత కార్మికులు

మర్రిగూడ : రైతు బీమా తరహాలో గీత కార్మికులకు సైతం బీమాను వర్తింపజేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడం పట్ల మండలంలోని దామెరభీమనపల్లి గ్రామానికి చెందిన గీతకార్మికులు బుధవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సిలివేరు విష్ణు మాట్లాడుతూ.. గీత కార్మికులు ఏదైనా ప్రమాదవశాత్తు మరణిస్తే రైతుబీమా తరహాలో రూ.5లక్షల బీమాను కుటుంబ సభ్యులకు అందజేయనున్నట్లు తెలిపారు. గీత కార్మికులు బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నడిమింటి శ్రీను, బెల్లకొండ నర్సింహాగౌడ్, మలిగిరెడ్డి కృష్ణారెడ్డి, అంబళ్ల రవిగౌడ్, వెంకట్, నాగిరెడ్డి, శివ, మహేష్, రమేష్, ఎల్లయ్య, శ్రీకాంత్, జయరాములు పాల్గొన్నారు.

బీమా పథకం ప్రకటనపై హర్షం

చిట్యాల : సీఎం కేసీఆర్ కల్లు గీత కార్మికులకు రూ.5లక్షల ప్రమాదబీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ప్రకటించటం పట్ల పట్టణానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కూసురు సంజయ్‌దాస్‌గౌడ్ బుధవారం హర్షం వ్యక్తం చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మర్రిగూడ : మండలంలోని కుదాభక్షపల్లి గ్రామ పరిధిలో గల సాయిబండాతండాకు చెందిన కొర్ర లక్ష్మాకు మంజూరైన రూ.42వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు పందుల పాండుగౌడ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కారింగు నర్సింహ, మైలారపు గిరీష్, జవహర్ తదితరులు పాల్గొన్నారు.

చండూరులో విగ్రహాల లొల్లి

చండూరు : మున్సిపల్ కేంద్రంలో పలువురు దివంగత నాయకుల విగ్రహాల ఏర్పాటు లొల్లి తీవ్రస్థాయికి చేరింది. ఆయా పార్టీలకు చెందిన నాయకుల విగ్రహాలను అనుమతులు లేకుండా ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇదే విషయంపై రెండు రోజులుగా వాట్సాప్ గ్రూపులను వేదికగా చేసుకొని పార్టీల నాయకులు విమర్శలు, ఆరోపణలు చేసుకుంటున్నారు. ఏకంగా బుధవారం మాజీ ఎంపీపీ మంచుకొండ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ ఏశాల సత్యనారాయణ, మడేల్ లింగయ్య, టీడీపీ నాయకుడు ఏలే సూరయ్య తదితర విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపనలు చేసేందుకు యత్నాలు మొదలయ్యాయి. హైస్కూల్ ప్రహరీ పొడవునా విలువైన స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారు. ఇదే ప్రాంతంలో కమర్షియల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ అధికారులు ఆ వ్యాపారులను ఖాళీ చేయించారు. కాంప్లెక్స్ ఏర్పాటు చేయకపోవడంతో ఆయా పార్టీల నేతలు, ఆయా కులాలకు చెందిన నాయకులు విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. ముందుగా విగ్రహాల ఏర్పాటుకు మున్సిపల్ అధికారులకు దరఖాస్తులు చేసుకోవాలి, ఆ తర్వాత పాలకవర్గం తీర్మానాలు చేసి అనుమతుల కోసం కలెక్టర్‌కు నివేదిక అందించాల్సి ఉంది.



చండూరు హైస్కూల్ ఎదుట ఏర్పాటు చేస్తున్న విగ్రహాల దిమ్మెలు

విగ్రహాల ఏర్పాటుపై నోటీసులు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీకి ఆనుకొని విగ్రహాల ఏర్పాటుకు నిర్మాణాలు చేస్తున్న దిమ్మెలకు మున్సిపల్ అధికారులు ఎట్టకేలకు నోటీసులు అంటించారు. వారం రోజుల నుంచి అనధికారికంగా మూడు విగ్రహాల ఏర్పాటుకు నిర్మాణాలు జరుగుతున్నాయని రెండు రోజులుగా స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు దిమ్మెలకు నోటీసులు అంటించారు. మున్సిపల్ చట్టం ప్రకారం నిర్మాణాలు అక్రమమని తేలితే.. నోటీసులు అందిన 7రోజుల లోపు జిల్లా విగ్రహ కమిటీ అనుమతి పత్రం కలిగి ఉండాలని, లేనిచో చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు.

నేటినుంచి బొడ్రాయి పునఃప్రతిష్ఠ మహోత్సవం

మర్రిగూడ : మండల పరిధిలోని మేటిచందాపురం (ఇందుర్తి) గ్రామంలో నేటి నుంచి (గురువారం) 7వతేదీ వరకు బొడ్రాయి (నాభిశిల) పునః ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సర్పంచ్ జంగిలి లక్ష్మీప్రసన్నరవి బుధవారం తెలిపారు. గ్రామ ప్రజలు 6న శనివారం రాత్రి 9గంటల వరకే గ్రామానికి చేరుకోవాలని గ్రామ బంధనం తరువాత తిరిగి రావడానికి కుదరదని కమిటీ సభ్యులు తెలిపారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనకు విరాళం

మర్రిగూడ : మండలంలోని మేటిచందాపురం(ఇందుర్తి) గ్రామంలో ఏర్పాటు చేయనున్న బొడ్రాయి ప్రతిష్ఠాపనకు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ కుంభం శ్రీనివాస్‌రెడ్డి తన తల్లిదండ్రులైన కుంభం సత్యనారాయణరెడ్డి పద్మమ్మ బుధవారం రూ.5లక్షల విరాళాన్ని ప్రతిష్ఠ మహోత్సవ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చెరుకు లింగంగౌడ్, నగేష్, అశోక్, యాదగిరి, లింగస్వామి, రాములు, శ్రీను పాల్గొన్నారు.

గ్రంథాలయం పరిశీలన



గ్రంథాలయంలో వసతులను పరిశీలిస్తున్న రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠకులకు టాయిలెట్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా ప్రహరీ, తాగునీటి వసతి కల్పిస్తానని అన్నారు. ఆయన వెంట లైబ్రేరియన్ రవికుమార్, సిబ్బంది ఉన్నారు.

6న విద్యుత్ సమస్యలపై ప్రత్యేక కోర్టు

నకిరేకల్ : పట్టణంలోని మూసీరోడ్డులో గల విద్యుత్ శాఖ ఏడీ ఉపకార్యాలయంలో ఈనెల 6న ఉదయం 10గంటల నుంచి 2గంటల వరకు నకిరేకల్, శాలిగౌరారం, కేతేపల్లి, కట్టంగూరు మండలాల్లోని విద్యుత్ వినియోగదారుల సమస్యలపై ప్రత్యేక కోర్టును నిర్వహించనున్నట్లు విద్యుత్ ఏడీ శ్రీకాంత్ బుధవారం తెలిపారు. వినియోగదారులు ఆధార్‌కార్డు, విద్యుత్‌బిల్‌ను తీసుకువచ్చి దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు.